అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 16 జులై 2023

## ర్యాగింగ్ నిషేధ చట్టంపై అవగాహన

**నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)**

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ర్యాగింగ్ నిషేధ చట్టంపై కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షలు, ర్యాగింగ్ నిర్మూలనపై వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి తిరుచిరాపల్లి యస్‌పీ భార్గవి , లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ చీఫ్, ఆర్‌బి రమేష్ చంద్, డిప్యూటీ ,మోహన్ రావు . చిరంజీవి ఏజీపీ లతారెడ్డి, అడ్వకేట్ షబానా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సీనియర్ అసిస్టెంట్ భరత్ కుమార్ జూనియర్ అసిస్టెంట్ జె. సాయి ప్రణీత్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కే సాయికృష్ణ, సుబార్డినెట్ నరసింహ చారి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## అదనపు కలెక్టర్‌గా మనుచౌదరి బాధ్యతల స్వీకరణ

**నవతెలంగాణ-కామారెడ్డి**

కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా మనుచౌదరి శనివారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టరేట్ ఏవో రవీందర్, డీఆర్‌డీవో పీడీ సాయన్న, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు నరాల వెంకటరెడ్డి, కార్యదర్శి బి.సాయిలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అంతకుముందు ఆయన.. జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను, అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్‌కు మొక్క బహూకరిస్తున్న మనుచౌదరి




మాట్లాడుతున్న కలెక్టర్.. హాజరైన విద్యార్థులు

## యువత పోటీతత్వం పెంచుకోవాలి

- యువజనోత్సవంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

**నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)**

యువత పోటీతత్వం పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం యువజనోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో రాణించాలని, సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైందని, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచిన యువకులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతారని, అక్కడ రాణించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపుతారని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా ఉపన్యాస, వ్యాసరచన, పెయింటింగ్, నృత్యాలు, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫామ్, ఎస్‌బిఐ ఆధ్వర్యంలో దుస్తులు, మత్స్య శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, నెహ్రూ యువ కేంద్రం తదితర శాఖలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను కలెక్టర్ తిలకించారు.

అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త శైలి, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, ఎన్నికల నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖాధికారి వరదారెడ్డి, వివిధ ప్రైవేట్ కళాశాలల ప్రధానాచార్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లకు అవగాహన

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి. వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మి నర్సయ్య ఇరు జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష నిర్వహించారు. సెక్షన్ 498ఎ, గృహహింస చట్టం, వరకట్న నిషేధ చట్టం కేసులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు విశదీకరించారు.

అంతకుముందు ఇటీవలే గుండె పోటుతో హఠాత్తుగా మరణించిన ఎసిబి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సమావేశంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు యం.డి. రహిమోద్దీన్, భూసారపు రాజేష్ గౌడ్, అశోక్ శివరాం నాయక్, చిదిరాల రాణి, వీరయ్య, పొరిక రాజేశ్వరి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి. రవిరాజ్, రాజ్ గోపాల్ గౌడ్, కవిత రెడ్డి, నంద రమేష్, కే. శేషు, నిమ్మ దామోదర్ రెడ్డి, డా? సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సఫాయి కార్మికులకు సలాం, సన్మానాలు చేస్తే సరిపోదు

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలి
- సమ్మె నిర్వీర్యానికి ప్రయత్నిస్తే ఖబర్దార్
- కార్మిక సంఘాలతో చర్చలు జరిపాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

**నవతెలంగాణ-నవీపేట్**



నవీపేట్‌లో జీపీ కార్మికుల సమ్మెలో కూర్చున్న నాయకులు, కార్మికులు

సఫాయి కార్మికులకు సలాం చేసి సన్మానాలు చేస్తే సరిపోదని కనీస వేతనాన్ని అమలు చేసి మౌలిక సదుపాయాలను కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్ గౌడ్, నూర్జహాన్ అన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది 10వ రోజు సమ్మె శిబిరానికి సంఘీభావంగా హాజరై మాట్లాడారు. కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం పది రోజులుగా సమ్మె చేస్తుంటే అధికారులు పోటీ కార్మికులను పెట్టి సమ్మెను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో బెదిరింపు చర్యలకు పూనుకోవడం అవివేకమని అన్నారు. ప్రభుత్వ చర్యకు కార్మికులు స్పందించిన తీరు అభినందనీయమని అన్నారు. కరోనాకాలంలో సఫాయి కార్మికులు చేసిన సేవలకు కేసీఆర్ సఫాయిలకు సలాం అంటూ, నరేంద్ర మోడీ కాళ్లు కడిగి సత్కారాలు చేయడంతో కార్మికుల కడుపు నిండదని కనీస వేతనాన్ని అమలు చేసి కనీస సౌకర్యాలను కల్పించాలని అన్నారు. కేవలం ప్రచారాలు ఓటు బ్యాంకు రాజకీయాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిమితం అవుతున్నాయని అన్నారు. సమాజంలో అత్యంత పేదలు దళితులు సఫాయి కార్మికులని అటువంటి వారికి దళిత బంధు ఇవ్వకుండా పార్టీ నాయకులకు ఇవ్వడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో రోజురోజుకు చెత్త పేరుకుపోయి ప్రజలు అనారోగ్య బారినపడే అవకాశాలు ఉన్నాయని కాబట్టి వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమ్మె విరమించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని లేనియెడల తర్వాత జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్, జిల్లా నాయకులు పద్మ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ అంజన్న, మైన్ కుమార్, రంజిత్, గంగారం, పోశెట్టి, రాములు, భోజన్న దేవకి పాల్గొన్నారు.

## బెస్ట్ వారియర్స్‌కు.. ఉద్యోగ భద్రత కల్పించరా..?

- యూనియన్ జేపీసీ జిల్లా అధ్యక్షులు వెంకట్‌గౌడ్



బిచ్కుందలో మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

**నవతెలంగాణ-బిచ్కుంద**

కరోనా సమయంలో, దశాబ్ది ఉత్సవాలలో జీపీ కార్మికుల సేవలను కొనియాడుతూ బెస్ట్ వారియర్స్ అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినప్పటికీ వీరికి ఉద్యోగ భద్రత కల్పించడం లేదని నాయకులు మండిపడ్డారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి 10వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, పిట్లం మండలాలకు చెందిన గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు ముందుగా మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలుపుతూ ర్యాలీగా బయలుదేరి కొత్త బస్టాండ్ నుండి జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ఇంటి వరకు ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. వెంకట్ గౌడ్ హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని మల్టీ పర్పస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి 20 జీవో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు చేపట్టే దశల వారి పోరాటానికి సిఐటియు పూర్తి మద్దతుగా వెన్నంటూ ఉంటదని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటి వద్దకు కార్మికులు చేరుకోగా.. అనుమతి లేకపోవడంతో సిబ్బందికి 14 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్నూర్, జుక్కల్, పిట్లం, బిచ్కుంద మండలాలలోని వివిధ గ్రామాల ఉద్యోగ కార్మికులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

- హాస్టల్‌లో ఉండి చదవడం ఇష్టంలేక బలవన్మరణం

**నవతెలంగాణ-రాజంపేట్**

హాస్టల్‌లో ఉండి చదవడం ఇష్టం లేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డ మీది శ్రీనిజ(15) జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. పదవ తరగతి వరకు కస్తూర్బాలో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంది. ఇంటర్‌లో హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తాతయ్య 11 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు లోపలి నుండి గడియ పెట్టడం గమనించిన అతను ఇరుగుపొరుగు వారిని పిలిచి తలుపులు పగలగొట్టగా శ్రీనిజ ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

**నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్**

పందులు అడ్డురావడంతో వాటిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి ఒకరు మృతిచెందిన ఘటన కాలుర శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. నిజామాబాద్ రూరల్ ఎస్సై లింబాద్రి వివరాల ప్రకారం.. నిజామాబాదులోని దుబ్బ కాలనీకి చెందినటువంటి తొందురు లింగం (43) అనే వ్యక్తి నిన్న పని మీద తన మోటార్ సైకిల్ పైన కాలూరు వెళ్తుండగా మార్గమధ్యలో పందులు అడ్డురాగా వాటిని తప్పించబోయి అతను బండి అదుపుతప్పి కిందపడిపోగా తలకి ఇతర భాగాలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమించి రాత్రి సమయంలో మృతిచెందాడు. మృతుడి తమ్ముడైన సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

## రోడ్డుపై వరినాట్లు



నాట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

**నవతెలంగాణ-జుక్కల్**

జుక్కల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి గుండూర్ రోడ్డు పూర్తిగా గుంతల మయం కావడంతో బురదనీటితో నడవలేని పరిస్థితి నెలకొందని జుక్కల్ యూత్ ఫోరం సభ్యులు జాదవ్ సాయికర్ణ తెలిపారు. ఆ రోడ్డుపై శనివారం వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటీ రోడ్డు మంజూరైనా.. పనులు చేపట్టడం లేదని, దీంతో వర్షానికి గుంతలు ఏర్పడ్డట్టు తెలిపారు. పాదచారులు నడవ లేని దుస్థితి నెలకొందని దీంతో ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులకు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును వేయించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో యూత్ ఫోరం సభ్యులు గైక్వాడ్ విఠల్, అయిల్ వార్ మారుతీ, జాదవ్ సాయికర్ణ, ఎండి ఆర్మాన్, బిరాదార్ మారుతీ, నర్సింగ్, ఎం. కృష్ణ , శ్రీకాంత్, సిద్ధు, పండరి తదితరులు పాల్గొన్నారు.

# మరుగుదొడ్లు, మంచినీళ్లు లేవ్

- ఐదు తరగతులకు రెండు గదులా..?
- స్కూళ్ల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

**నవతెలంగాణ-బిచ్కుంద/మద్నూర్**





బిచ్కుంద మండలం పెద్ద దడ్గి స్కూల్ ఎదుట నిరసన.. మద్నూర్ మండల కేంద్రంలో తల్లిదండ్రుల నినాదాలు

బిచ్కుంద మండలంలోని పెద్దదడ్గీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవసరాల కోసం మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట శనివారం ఆందోళన చేశారు. పాఠశాలలో 204 మంది విద్యార్థులు ఉండగా మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఆరుబయటే వెళ్లాల్సి వస్తోందని పాఠశాల పరిసరాల్లో వర్షపు నీరు నిలిచి దుర్గంధం వ్యాప్తి చెందిందని పరిసరాలు అపశుభ్రంగా తయారయ్యాయని చుట్టూరా పిచ్చి మొక్కలు పెరగడం వలన పాములు, తేళ్లు అందులో చేరి విద్యార్థులకు కాటు వేసే ప్రమాదాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజాపూర్, ఎల్లారం, సీతారంపల్లి, మాన్యాపూర్ గ్రామాల నుండి విద్యార్థులు వచ్చి ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని పాఠశాలలో కనీసం తాగునీటి వసతి లేకపోవడం వలన ఇంటినుండే బాటిల్ లో తెచ్చుకొని తెచ్చుకున్న కొద్ది తాగునీటినే తాగుతున్నారని దీంతో విద్యార్థులు అనారోగ్యానికి గురి అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నోసార్లు సమావేశాలు నిర్వహించి సమస్యలు విన్నవించిన పరిష్కారానికి నోచుకోలేదని పాఠశాలలో 8 మంది గాను ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారని పూర్తిస్థాయి ఉపాధ్యాయు లను నియమించి ఇక్కడ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు పట్టించుకోకుండా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఇలాగే కొనసాగితే ఆందోళన ఉధృతం చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.

**ఐదు తరగతులకు.. రెండే గదులు**

**మద్నూర్ :** మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం పాఠశాలను సందర్శించి ఆందోళన చేపట్టారు. ఇక్కడ ఐదు తరగతులు ఉంటే రెండే గదులు ఉపయోగంలో ఉన్నాయని, మిగతా గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలల్లో గల మరుగుదొడ్లు మూత్రశాలలు కంపు కొడుతున్నాయని తల్లిదండ్రులంతా ఆందోళనకు దిగారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బాలికల ఉన్నత పాఠశాల పాత భవనాన్ని కూల్చేసి కొత్తగా నిర్మిస్తున్నారు. ప్రాథమిక పాఠశాల మాత్రం పాత భవనంలోనే కొనసాగిస్తున్నారు. ఒకపక్క గదులు లేక ఇబ్బందులు మరోపక్క కాంట్రాక్టర్ పనులతో విద్యార్థిని విద్యార్థులకు కూర్చోరాన్ని పరిస్థితి ఏర్పడిందని మూత్రశాలలు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని గదులు సరిపోయే విధంగా సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రైవేటు వద్దు ప్రభుత్వమే ముద్దు అనే నినాదాన్ని తల్లిదండ్రులం తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువుగా ఉన్నాయని విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిలో మార్పు రాకపోతే తల్లిదండ్రులమంతా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

## టీయూ బంద్ విజయవంతం

- ప్రభుత్వానికి యూనివర్సిటీ విద్యార్థుల గోడు పట్టదా..?
- ఇన్‌చార్జి వీసీ.. టీయూను సందర్శించాలి : ఎస్ఎఫ్ఐ



ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

'తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థుల గోస ప్రభుత్వానికి పట్టదా..? ఇన్‌చార్జి వీసీగా నియమితులైన వాకటి కరుణ తెలంగాణ యూనివర్సిటీని వెంటనే సందర్శించి యూనివర్సిటీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని' భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ టీయూ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన తెలంగాణ యూనివర్సిటీ బంద్ విజయవంతమైంది. బంద్‌లో భాగంగా ఆర్ట్స్ కాలేజ్, కామర్స్ బిల్డింగ్‌లను బంద్ చేయించి ర్యాలీగా సెంట్రల్ లైట్ వరకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి శ్రీశైలం మాట్లాడారు.

వివరాలు మెయిన్‌లో..

## పొంగిన తూములు

- నసురుల్లాబాద్‌లో భారీ వర్షం.. కుంటలుగా మారిన పొలాలు





పొంగిపొర్లుతున్న మిర్జాపూర్ ఊర చెరువు.. నాచుపల్లిలో నీటితో నిండిన పొలాలు

**నవతెలంగాణ-నసురుల్లాబాద్**

బాన్సువాడ డివిజనన్ లోని నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. నసురుల్లాబాద్ మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున వరకు కుండపోత వర్షం కురిసింది. బాన్సువాడ మండలంలో 107 మిమి మీటర్ల వర్షం కురియగా నసురుల్లాబాద్ మండలంలో 65, బీర్కూర్ లో 74 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మండల కేంద్రంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మిర్జాపూర్ గ్రామంలో ఉర చెరువులు పొంగిపొర్లుతున్నాయి. నాచుపల్లి శివారులో నాటు వేసిన పొలాలు చెరువు కుంటల మారినాయి. పొలం నాటిన రెండు రోజులకె భారీ వర్షం కురియడంతో పొలాలు పూర్తిగా నీటితో నిండి పోయాయి. మండలంలోని ఉన్న కొన్ని చెరువులు ఈ భారీ వర్షం నిండి తూములు పొర్లుతున్నాయి. బీర్కూర్ మండల కేంద్రంలో పలు విధుల్లోకి వరద నీరు వచ్చి చేరింది.

## కూలిన వంతెన

- ఏండ్లు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**



కూలిన వంతెన.. ప్రమాదకరంగా ప్రయాణం

మండలంలోని పోచారం తండా-పోచారం గ్రామానికి మధ్యలో ఉన్న వంతెన శుక్రవారం నాడు రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులో ఒక్కసారి భారీ వరద రావడంతో వంతెన కూలి పోయింది. శిథిలావస్థకు వచ్చిన వంతెన నిర్మా ణాన్ని ఏండ్లుగా పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో పోచారం గ్రామానికి చెందిన జడ్పీటీసీ చంద్రభాగ్.. జడ్పీటీసీ ఎన్నికల సమయంలో వంతెన నిర్మిస్తానని హామీ ఇచ్చి నాలుగేండ్లుగా పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

వంతెన శిథిలావస్థకు చేరడంతో కూలుతుందని పలుమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఒక్క వర్షానికి సగం కూలిన వంతెన ఇంకా వర్ష కాలంలో కురిసే భారీ వర్షాలకు మొత్తం కూలిపోయే ప్రమాదం ఉంది. భారీ వర్షాలు కురిసి వాగుకు వరదలు వస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొననుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నూతన వంతెనను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## అర్ధరాత్రి.. ఆగని సఫాయి సమ్మె



సమ్మె శిబిరంలోనే పడుకున్న జీపీ పారిశుధ్య కార్మికులు

**నవతెలంగాణ-నవీపేట్**

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. నవీపేట్‌లో అర్ధరాత్రి వేళ సైతం సమ్మె శిబిరంలోనే కార్మికులు నిద్రపోతూ సమ్మె కొనసాగిస్తున్నారు. నవీపేట్ గ్రామం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో ఎంపిక కావడంతో అధికార యంత్రాంగం సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు పోలీసులతో బల ప్రయోగం చేసేందుకు శుక్రవారం యత్నించింది. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించడంతో కార్మికుల్లో మరింత పోరాట స్ఫూర్తితో సమ్మె శిబిరంలోనే నిద్రించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయమైన సమ్మె డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఆర్థికసాయం అందజేస్తున్న ధన్‌పాల్

నగరంలోని కోటగల్లికి చెందిన హరిబాబు పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. తక్షణసాయంగా ధన్పాల్ లక్ష్మీబాయి విఠల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాగోల్ల లక్ష్మీనారాయణ, గోపిడి వినోద్ రెడ్డి, అంత రెడ్డి హరీష్ రెడ్డి, ఆశిష్, భాస్కర్ రెడ్డి, భట్టికార ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


నవతెలంగాణ

నిజామాబాద్




## రూ. 5.86 లక్షల పావలా వడ్డీ అందజేత

నవతెలంగాణ-మాక్లూర్



మండలంలోని కృష్ణనగర్ గ్రామంలో పావలా వడ్డీ రూ.5.86 మహిళా సంఘాలకు శనివారం ఐకెపి అధ్వర్యంలో అందజేశారు. 15 గ్రూపులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. వడ్డీ పైసలు తిరిగి వచ్చినందుకు మహిళా సంఘ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దర్గల అనితసాయిలు, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు హైమ్మద్, ఖాజా వాసుదేవరావు, శ్రీనివాస్ రావు, ఐకెపి సిసి రాజేష్, ఐకెపి సభ్యులు, విఓఏ అనురాధ పాల్గొన్నారు.

# బోనమెత్తిన విద్యార్థులు

- పలు స్కూళ్లల్లో ఘనంగా బోనాలు
- పోతరాజుల వేషాధారణలో విన్యాసాలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ నగరంలోని న్యాల్కల్‌రోడ్‌లో గల రోటరీ నగర్ నందుగల హోవర్డ్ హైస్కూల్‌లో శనివారం బోనాల సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. బోనం అంటే నైవేద్యమని అమ్మవారికి ప్రతి ఆషాడ మాసంలో నైవేద్యం సమర్పించి సకల జీవులందరూ కూడా క్షేమంగా ఉండాలని, వర్షాలు అధికంగా కురిసి పాడిపంటలు బాగా ఉండాలనీ, వర్షాకాలంలో వచ్చే రోగాలు దరిచేరకుండా కాపాడాలని మొక్కును తీర్చుకుంటారని అన్నారు. మొదటగా పాఠశాల నుండి బోనంను పీఎఫ్ ఆఫీసునందు గల అమ్మవారికి సమర్పించి అనంతరం విద్యార్థులతో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా హెూవర్డ్ ఇనిస్టిట్యూషన్స్ మేనేజ్మెంట్ కరస్పాండెంట్ టీవిఆర్‌మూర్తి, ప్రిన్సిపల్ డాక్టర్ టీ.ఎస్ శశికళ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

**నిజామాబాద్ సిటీ:** నగరంలోని వర్ని రోడ్‌లోగల వీఎస్ఆర్ పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించామని కరస్పాండెంట్ వీణా యాదేష్ గౌడ్ తెలిపారు. ఈ పండగను ప్రతి సంవత్సరం స్కూల్ లో నిర్వహిస్తామని తెలిపారు. పోతరాజుల నృత్యాలు, బోనాన్ని తీసి పండగను పండగ విశిష్టతను పిల్లలకు వివరించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్న, శ్రీహరి, విజయ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**ముప్కాల్:** మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్లో నిర్వహించిన బోనాల పండుగలో విద్యార్థులు వివిధ వేషధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో ఊరేగింపుగా వాడ వాడల్లో తిరుగుతూ కనువిందు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ చవాన్, డైరెక్టర్లు నర్సయ్య, రాజేందర్, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**ఆర్మూర్ :** పట్టణంలోని క్షత్రియ, జెంటిల్ కిడ్స్, లిల్లీపుట్, ఆల్ఫోర్స్ పాఠశాలలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. క్షత్రియ విద్యాసంస్థల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అల్జాపూర్ వీరేంద్ర, ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ దేవేందర్ మాట్లాడుతూ.. గ్రామ దేవతలను పూజిస్తూ జరిపే బోనాలు పండుగ అనాదిగా వస్తున్న ఆచారమని అన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహ స్వామి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సంస్కృతిని ఈ తరం విద్యార్థులకు తెలియజేప్పాలనే ఈ బోనాల ఉత్సవాన్ని నిర్వహించామన్నారు. బోనాలను ఎత్తుకున్న విద్యార్థినునలు, విద్యార్థుల పోతురాజుల విన్యాసాలు నృత్య ప్రదర్శన చూపరులను ఎంతోగానో ఆకట్టుకున్నాయి.

**జెంటిల్ కిడ్స్,, లిల్లీపుట్ పాఠశాలలో...**

పట్టణంలోని జెంటిల్ కిడ్స్ జండా గల్లి, మామిడిపల్లి పాఠశాలలలో జరిగిన బోనాల వేడుకలలో అమ్మవారి వేషధారణ, పోతరాజుల విన్యాసాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. లిల్లీపుట్ పాఠశాలలో జరిగిన బోనాల కార్యక్రమంలో కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ దాస్, ఆల్ ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

**నరేంద్ర, ఆల్‌ఫోర్స్ పాఠశాలల్లో...**

పట్టణ శివారులోని బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్ వద్ద గల ఆల్ ఫోర్స్ నరేంద్ర పాఠశాలలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా బోనాల సంబరాలు నిర్వహించారు. 50 మంది విద్యార్థులు బద్ధంగా బోనాలను ఎత్తుకొని పండగ వాతావరణం సృష్టించారు. పట్టణంలోని నారాయణ పాఠశాలలో జరిగిన బోనాల కార్యక్రమంలో జిల్లా ఏజీఎం శివాజీ, ప్రధాన ఉపాధ్యాయులు గోపీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఏర్గట్ల:** మండలకేంద్రంలోని నలంద పబ్లిక్ స్కూల్‌లో బాలికలు బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు.బోనాల ముందర విద్యార్థులు వివిధ వేషధారణలతో నృత్యాలు చేస్తూ అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట్ గౌడ్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వేల్పూర్:** మండల కేంద్రంలో బ్లూమింగ్ బడ్స్ పాఠశాల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో డిజె సౌండ్స్‌తో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపల్ రాజు గుజరాతి, చైర్పర్సన్ స్రవంతి గుజరాతి, బోనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేల్పూర్ మండల విద్యాశాఖ అధికారి వనజ రెడ్డి, సర్పంచ్ తీగల రాధా మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వం చేపడుతున్న బోనాల పండుగ లో పాలు పంచుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాయత్రి, రాకేష్, అవంతిక రాధా, గంగా అన్వేష్, నవ్య వసంతా తదితరులు పాల్గొన్నారు.




నిజామాబాద్ : హోవర్డ్ పాఠశాలలో..




నిజామాబాద్ : హోవర్డ్ పాఠశాలలో..



ఏర్గట్లలో..



వేల్పూర్ :బ్లూమింగ్‌బడ్స్ పాఠశాలలో..



నిజామాబాద్ సిటీ : వీఎస్ఆర్ పాఠశాలలో..



ముప్కాల్ : కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్లో



బాల్కొండలోని శాంభవి హైస్కూల్లో..



నిజామాబాద్‌లోని బ్రిలియంట్ పాఠశాలలో



ఆర్మూర్ : ఆల్‌ఫోర్స్ నరేంద్ర పాఠశాలలో



ఆర్మూర్ : క్షత్రియ పాఠశాలలో..

## తడపాకల్ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఏర్పాటుచేసిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పఠనోత్సవ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ... వారం రోజుల నుండి విద్యార్థులతో గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదవించామని, అందులో ఉన్న అంశాలను విద్యార్థులతో కథారూపంలో చెప్పించడం జరిగిందన్నారు. పఠన నైపుణ్యంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు చక్కని కథల పుస్తకాలను బహుమతిగా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్.ఎం మునిరోద్దీన్, హెచ్.ఎం.రాములు, ఉపాధ్యాయులు రవీంధర్, శంకర్, నాగప్ప, కృష్ణ ప్రసాద్,సుజాత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## చురుగ్గా కల్యాణ మండపం పనులు

నవతెలంగాణ-నందిపేట్



నందిపేట్ పట్టణ అభివృద్ధి పై ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సాధించారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ అన్నారు. పట్టణంలో చేపడుతున్న పద్మశాలి మండపంకోసం షెడ్డు సామాగ్రి వచ్చినట్లు శనివారం తెలిపారు. సొంత నిధులు రూ. 60 లక్షల రూపాయల షెడ్డుకోసం పంపించారన్నారు. అన్ని కులాలకు సంబంధించిన కళ్యాణ మండప పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. మండపం పూర్తి కాగానే నందిపేట్ మండలంలోని పేదింటి పద్మశాలి ఆడబిడ్డకు అన్నీ తానే ఉచితంగా వివాహం జరిపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చాడని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నందిపేట్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు మచ్చర్లసాగర్, నందిపేట్ మండల పద్మశాలి నాయకులు మన్నూర్ భుమేష్, బొడ్డు రాజశేఖర్, స్వర్గం నర్సయ్య, రవి, కొండూరు భోగన్న, తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలకోసం కార్మిక గర్జన

నవతెలంగాణ- నిజామాబాద్‌సిటీ

కనీస వేతనాలకై కార్మిక గర్జన" విజయవంతం చేయాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ కు కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో కార్మిక గర్జన పోస్టర్లను శనివారం జిల్లా కేంద్రంలోనీ తిలక్ గార్డెన్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.సుధాకర్ మాట్లాడుతూ... కేజీబీవీల్లోని నాన్ టీచింగ్, వర్కర్స్‌కు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేదన్నారు. జీవో 60 వీరికి అమలు కావడం లేదన్నారు. కేజీబీవీల్లో పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలన్నారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు ఆగస్టు 4న హైదరాబాద్‌లో కార్మిక గర్జన నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలోని కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరి, కేజీబీవీ సిబ్బంది సంధ్య, ఉమ, అమృత, లక్ష్మీ, సుజాత, నగ్మా, సునీత, కల్పన, మాధవి, తాయేబా, గంగామణి పాల్గొన్నారు.

## రాత అచ్చు పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు అభ్యుదయ గ్రామీణ వికాస సంఘం ఆధ్వర్యంలో అచ్చు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంజి సాయన్న మాట్లాడుతూ పేద విద్యార్థులకు చదువు, చేతి రాత మెరుగుపడే విధంగా ఉండేందుకు 160 మంది విద్యార్థినులకు 30 వేల విలువగల రాత అచ్చు పుస్తకాలను దాతల సహకారంతో అందించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దొండి నరేందర్, నాంపల్లి వసంత్, జీడిపల్లి రాజారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ వీరేంద్ర శేఖర్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పాఠశాల ఎస్వో వినోద మాట్లాడుతూ.. విద్యార్థులకు నైపుణ్యం కలిగిన ఉత్తమ ఉపాధ్యాయులచే విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్నామని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర కూడా ముఖ్యంగా వుండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 17 నుండి ఇంటింటికీ తెలుగుదేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ అర్బన్‌లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం 11, 12 వార్డుల్లో సోమవారంనుండి ప్రారంభిస్తామని అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ అన్నారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పనిచేసి అర్బన్ లో పార్టీ అభివృద్ధి కొరకు పాటుపడాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎస్టి నాయకులు బాబు సింగ్ ను కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శంకర్ ముదిరాజ్, కల్లెడ గంగాధర్, అశోక్ ఆర్సపల్లి, ఫిరోజ్, అప్సర్, హరీష్, బాబు సింగ్, అమీర్ ఖాన్, కలీం, ఇమ్రాన్ చోయుష్, ఇర్షద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే రేషన్ బియ్యం అందించాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రతి నెల కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇప్పటివరకు కూడా ఇవ్వలేదని బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ వేణు గోపాల్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర కోటా రేషన్ బియ్యాన్ని సరఫరా చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ ఇప్పటికీ ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొట్ల విజయ్, పట్టణ ఉపాధ్యక్షులు మీసాల రాజేశ్వర్, దోండి ప్రకాష్, శ్యామ్ గౌడ్ పట్టణ కార్యదర్శులు పులి యుగంధర్, ఖాందేశ్ ప్రశాంత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, కార్యదర్శి రాము, గిరిజన మోర్చా పట్టణ అధ్యక్షులు కెలోత్ పీర్‌సింగ్, బిజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, కిసాన్ మోర్చా పట్టణ ఉపాధ్యక్షులు నర్మే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణపై అవగాహన

నవతెలంగాణ-ధర్పల్లి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యబృందం కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహింహరు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపర్వైజర్ రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు కలుషిత నీటిని వాడరాదని, పరిసరాలు పరిశుభ్రాంగా ఉండేవిధంగా చూడాలని తెలిపారు. గుంటల్లో నీరు చేరకుండా చూడాలని వాటితో దోమలు చేరి డెంగ్యూ లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా ఇతరులకు అవగాహనా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్ వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు ,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయం ఎదుట పివైఎల్, పిఓడబ్ల్యూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. డెంగ్యూ విష జ్వరాలు అరికట్టాలని, శాశ్వత ప్రాతిపదికన డాక్టర్లు, సిబ్బంది ని భర్తీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) ప్రగతి శీల మహిళ సంఘం (పిఓడబ్ల్యూ) లు డిమాండ్ చేశారు. జిల్లా వైద్య అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా అధ్యక్షుడు బట్టు కిషన్, పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు వి. గోదావరి మాట్లాడుతూ.. డెంగ్యూ విష జ్వరాలు తీవ్రంగా ప్రబలుతున్నాయని, వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని అన్నారు. పట్టణలు గ్రామాలు శుభ్రంగా ఉంచేలా చూడాలని, దోమలను అరికట్టడానికి ప్రతి రోజూ ఫాగింగ్ ని చేయించాలని కోరారు. విష జ్వరాలతో పేషంట్లు వస్తే అడ్మిట్ సౌకర్యంలేక ప్రైవేటు హస్పిటళ్లకు వెళ్తున్నామని పేషెంట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు. ఆపరేషన్ చేస్తే కుట్లను వేసే దారం మొదలుకుని మందులు, ఇంజెక్షన్లు బయట మెడికల్ నుండి కొనుక్కుంటున్నా రని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, వైద్యులు లేక వ్యాధుల బారిన పడ్డ ప్రజలతో ప్రైవేటు హస్పిటల్స్, ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద జనం కిటకిటలాడుతున్నారని అన్నారు. విష జ్వరాలను అరికట్టడానికి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి గౌడ్, పిఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు సత్తెక్క, పీఓడబ్ల్యూ బోధన్ అధ్యక్షురాలు సాయక్క, నాయకులు తూర్పాటి శ్రీనివాస్, రవి, పద్మ, నర్సక్క, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కారించే వరకూ పోరాడాలి

- సీపీఐ(ఎం) రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ పెద్ది వెంకట్‌రాములు
- జక్రాన్‌పల్లిలో బిక్షాటన చేసిన జీపీ కార్మికులు

నవతెలంగాణ-మోపాల్/జక్రాన్‌పల్లి/ధర్పల్లి/ఆర్మూర్

జీపీవర్కర్ల సమ్మెకు నిజామాబాద్ రూరల్ సిపిఎం నియోజకవర్గ కమిటీ మద్దతు ఉంటుందని సీపీఐ(ఎం)రూరల్ నియోజకవర్గ ఇన్చార్జ్ పెద్ది వెంకట రాములు తెలిపారు. పంచాయతీ వర్కర్ల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఏ ప్రభుత్వం వచ్చిన కార్మికులను మెచ్చుకోవడమే తప్ప వాళ్ల సమస్యల పరిష్కారానికి నడుం బిగించలేదన్నారు. ధరలు పెరుగుతున్నా సఫాయి కార్మికుల వేతనాలు పెరగటం లేదన్నారు. అంటు వ్యాధులు సోకుతాయని తెలిసినా ఊరు మొత్తాన్ని శుభ్రం చేసి ప్రజారోగ్యానికి పాల్పడుతున్న గొప్ప ఫ్రంట్ లైన్ వారియర్స్ అని అన్నారు. కరోనా భారత దేశంలో విజృంపంచకపోవడానికి కారణం వీళ్లే అయినా వీరికి ఇప్పటికి ఉద్యోగ భద్రత లేదని, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలు లేవని అన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేసీఆర్‌కు వారి సమస్యలను పరిష్కారం చేయాలని లేఖ కూడా రాశారని తెలిపారు. కొంతమంది సర్పంచులు, ఎంపీడీవో, ఎంపీవో తదితర అధికారులు సమ్మెకు పోవద్దని, పని చేయండి.. లేకపోతే పనిలోంచి తీసేస్తామని బెదిరింపులు గురి చేస్తున్నారన్నారు. బెదిరించి కొంతమందితో పనిచేయించుకుంటున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ పోరాడాలని అన్నారు. లేకుంటే పార్టీగా కూడా తీవ్ర పోరాటాలు చేయవలసి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మెలో మండల జీపీ నాయకులు నందు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు భీమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.



మోపాల్: మాట్లాడుతున్న పెద్దివెంకట్రాములు

**జక్రాన్‌పల్లి:** పంచాయతీ కార్మికులు మండలకేంద్రంలోని సంతలో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సవిన్ కుమార్ అధ్యక్షులు, సంతోష్ కుమార్ సెక్రెటరీ, గంగాధర్ జాయింట్ సెక్రెటరీ, గోపి, కారాబార్లు పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్ర జేఏసీ కన్వీనర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు సమ్మెశిబిరం వద్ద మాట్లాడుతూ.. అనేక చోట్ల సర్పంచులు తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్లుగా అవతారం ఎత్తారని తెలిపారు. ఈనెల 18న ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వాలని, 21న జిల్లాకేంద్రంలో కలెక్టర్ వినతి పత్రాలు ఇచ్చి సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జేఏసీ డిమాండ్ చేస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు భానుచందర్, సవీన్, యస్.గంగాధర్, సంతోష్, గంగసాయిలు, పోచన్న, సర్వర్ లక్ష్మి పోసాని, నాగమణి, గున్నవ్వ, భోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ధర్పల్లి :** పంచాయతీ కార్మికులు తమ సమస్యల సాధనకు చేపడుతున్న సమ్మె శనివారం నాటికీ 10వ రోజుకు చేరింది. ఈసందర్భంగా పంచాయతీ కార్మికుల మండల యూనియన్ కార్యదర్శి మోపాల్ సాయిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తుందని ,పది రోజులుగా సమ్మె చేపడుతున్న కార్మికుల పట్ల కనికరం లేకుండా ప్రవర్తించడం బాధాకరమని అన్నారు. సమ్మెలో విలాస్, గంగన్న పాల్గొన్నారు.

**ఆర్మూర్ :** సఫారీ కార్మికులే నిజమైన దేవుళ్లంటూ సలాం కొట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సఫాయి కార్మికులు సమ్మె కనిపించడం లేదా అని తెలంగాణ ప్రగతిల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర అధ్యక్షులు దాసు ప్రశ్నించారు. పట్టాన ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో పాల్గొని దాసు మాట్లాడారు. రాష్ట్ర జేఏసీ స్టీరింగ్ కమిటీ మెంబర్ ఎండి కాజా . ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి సూర్య శివాజీ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బోదాసు లక్ష్మయ్య, మచ్చ గంగారం, పుష్ప, ఇస్సపల్లి గంగమణి, లింగవ్వ, నర్సు, పోసాని తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : భిక్షాటన చేస్తున్న కార్మికులు

## డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మేనేజర్

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం స్థానిక ఎసిబిఐ బ్యాంకు కార్యాలయంలో డిజిటల్ పేమెంట్స్ పై అవగాహనా కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రిజిఉద్దిన్ అస్లాం తెలిపారు, ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన కామర్స్ విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా ఈకార్యక్రమం నిర్వహించామని అన్నారు. మేనేజర్ విజయేశ్వరి విద్యార్థులకు డిజిటల్ పేమెంట్స్ మెథడ్స్ గురించి చాల చక్కగా వివరించారని తెలిపారు. బ్యాంకు ఫీల్డ్ అధికారి ప్రశాంత్ ఇంటర్నెట్ బ్యాంకింగ్, సైబర్ నేరాలను జరిగే విధానాలను వాటిని గుర్తించి ఏవిధంగా రక్షించుకోవాలో వివరించారు. కార్యక్ర మంలో కామర్స్ లెక్చరర్ మహేష్, ప్రవీణ్, విట్టల్, తదిత రులు పాల్గొన్నారు.

## మేరు సంఘం అధ్యక్షుడిగా రాచర్ల సంతోష్

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**



మేరు సంఘం అధ్యక్షుడిగా రాచర్ల సంతోష్ ఎన్నికయ్యారు. శనివారం పట్టణంలో మేరు దర్జీ సంఘం సమావేశం నిర్వహించారు. గత కొంతకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలపై చర్చించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పెద్దరెడ్డి ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా వాడపల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దర్జీ సాయిలు, రాచర్ల శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షుడిగా వీటు నర్సింలు, కొవ్వూరి బాలరాజు, విటూరి హనుమాన్లును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రవి, ప్రవీణ్, నరేష్, సతీష్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండలాధ్యక్షులకు సన్మానం

**నవతెలంగాణ-వర్ని**

వర్ని, చందూర్ మండలాధ్యక్షులుగా నియమితులైన కులకర్ణి సురేష్ బాబాను, పోతరాజు శ్రీనివాస్‌ను బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి సంగం శ్రీనివాస్‌గౌడ్ శనివారం శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజారెడ్డి, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు ప్రతాప్ సింగ్, సోషల్ మీడియా బోయిడి లక్ష్మణ్ తదితరులున్నారు.



మండలాధ్యక్షులను సన్మానిస్తున్న నాయకులు

# సమ్మె విరమించేది లేదు

- స్పష్టం చేసిన జీపీ కార్మికులు
- 10వ రోజుకు నిరవధిక సమ్మె

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బంది సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె విరమించేది లేదని పలువురు నాయకులు, కార్మికులు స్పష్టం చేశారు. శనివారం జీపీ కార్మికుల నిరవధిక సమ్మె 10వ రోజుకు చేరుకుంది.



గాంధారి : మాట్లాడుతున్న మోతీరాం నాయక్



భిక్కనూర్ : మాట్లాడుతున్న కొత్త నరసింహులు



ఎడపల్లిలో నిరసన

**గాంధారి** : మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్, సీఐటీయూ మండల కార్యదర్శి ప్రకాష్ నాయక్ కార్మికులు పాల్గొన్నారు.

**భిక్కనూర్** : గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త నరసింహులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కార్మికుల నిరవధిక సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. పంచాయతీ కార్మిక సంఘం నాయకులు యాదగిరి, శ్యామ్, నాగభూషణం, పెంటయ్య, తిరుమలరావు తదితరులున్నారు.

**రెంజల్** : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న జీపీ కార్మికుల సమ్మెలో తెలంగాణ గ్రామపంచాయతీ కార్మిక జేఏసీ జిల్లా అధ్యక్షులు జంగం గంగాధర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

**ఎడపల్లి** : మండల కేంద్రంలోని ధర్నాచౌక్‌లో పారిశుధ్య కార్మికుల సిబ్బంది సమ్మె కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. జేఏసీ కోకన్వీనర్ పాండు, కుంట సంతోష్, బిల్ కలెక్టర్ అధ్యక్షులు రాజు, గార్గింట్ల శ్రీనివాస్, స్వామి, ప్రవీణ్, లింగం, పద్మ, అబ్బవ్వ, సాయమ్మ, ఆయా గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

**బోధన్** : కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్, సీఐటీయూ సీనియర్ జిల్లా నాయకులు కుమారస్వామి, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కోశాధికారి గోవింద సాగర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి వారు మాట్లాడారు. కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు రేఖ, ఎల్లవ్వ, సావిత్రి, సాయవ్వ, నరసవ్వ ఎల్లవ్వ, తిరుపతి, రాజు, సలీం, మొగులయ్య, గంగాధర్, బేగరి సాయిలు, గౌతం కొండిబా, రాములు పాల్గొన్నారు.



బోధన్ : సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు, నాయకులు

## 42 మంది ఎస్ఐల బదిలీలు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నిజామాబాద్ జోనల్-2 భాసర పరిధిలో నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల పరిధిలో మొత్తం 91 మంది ఎస్ఐల బదిలీలు చేపట్టినట్టు పోలీసు అధికారులు శనివారం తెలిపారు. నిజామాబాద్ జిల్లా నుండి 47మంది ఎస్ఐలు బదిలీ అయ్యారని వెల్లడించారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**నవతెలంగాణ-భిక్కనూర్**

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మంజుల రాములు తెలిపారు. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో శనివారం 15వ ఆర్థిక సంఘానికి చెందిన 2లక్షల 50వేల వ్యయంతో సీసీ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, వైస్ ఎంపీపీ యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, సొసైటీ గ్రామ అధ్యక్షులు రాజాగౌడ్, ఎంపీటీసీ సభ్యులు సాయాగౌడ్, నాయకులు వీరస్వామి, రమేష్‌గౌడ్, నరసింహులు, సతీష్‌రెడ్డి, బ్రహ్మచారి, రాజు పాల్గొన్నారు.

## వీరన్నగుట్టలో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం



మాట్లాడుతున్న బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో ఇంచార్జ్ సీపీ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలో నేరాల నియంత్రణలో భాగంగా ముందు జాగ్రత్తగా సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాంలో ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వాహన ధ్రువపత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని సుమారు 47 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, నాలుగు కార్లను స్వాధీనం చేసుకొని విచారణ అనంతరం వాటిని అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజ్, ఎస్ఐ పండ్ల సాయన్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు సన్మార్గంలో వెళ్తే ఉజ్వల భవిష్యత్తు

**నవతెలంగాణ-తాడ్వాయి**

విద్యార్థులు సన్మార్గంలో వెళ్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తాడ్వాయి ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంగన్నగారి శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు వీరేశం, సంతోష్, మల్లేశం, సతీష్, సరస్వతి, శ్రీకాంత్, సతీష్, కళాశాల సిబ్బంది సోటేరియా, గౌతమ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని సాటాపూర్, బోర్గం గ్రామాల మధ్య ఉన్న ఉషశ్రీ పాఠశాలలో రిలయన్స్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను శనివారం నిర్వహించినట్లు కరస్పాండెంట్ రాజేశ్వర్‌గౌడ్, ప్రిన్సిపాల్ నసీరుద్దీన్ పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సాటాపూర్ సర్పంచ్ వికార్‌పాషా ప్రశంసపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ కంపెనీ బాధ్యుడు సాయిలు తదితరులున్నారు.

## కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలన

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోని నీలకంఠేశ్వర ఆలయానికి వెళ్లే దారిలో నిర్మిస్తున్న కల్వర్టు పనులను స్థానిక కౌన్సిలర్ జంగం నీల కంఠం శనివారం పరిశీలించారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణకు కౌన్సిలర్ నీల కంఠం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సేవా భరత్ యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో సేవ భారత్ యూత్ 2023-2025 సంవత్సరాల గానూ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. 1996-97 టెన్త్ బ్యాచ్ గత కొంతకాలంగా విస్తృతమైన సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మనలను పొందింది. అందులో భాగంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షునిగా రాచర్ల సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులుగా మంగలి పాండు, కోశాధికారిగా నిడాకర్ సాయిరాంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మౌలాన్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా మంగలి రవీందర్, డైరెక్టర్లుగా శంకర్, సిద్ధిరాములు, మహేష్‌గౌడ్, మంత్రి శ్రీనివాస్, హరినాథ్, వెంకట్‌రాములును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ముత్యాల శ్రీధర్, ఈశ్వర్, రాజేష్, ఇష్తేకర్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

**నవతెలంగాణ-సదాశివనగర్**

మండలంలోని తిమ్మోజివాడీ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్‌బీయస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, ఉపసర్పంచ్ రాజయ్య, డాక్టర్ అయిస్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

## నాందేవ్ పుణ్యతిథికి రూ.20వేలు విరాళం

**నవతెలంగాణ-కోటగిరి**

కోటగిరి ఉమ్మడి మండలంలోని పోతంగల్ బాలాజీ దేవాలయంలో నామదేవ్ మహారాజ్ పుణ్యతిథి సందర్భంగా మేరు సంఘం ఆధ్వర్యంలో భజనలు, కీర్తనలు అనంతరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు ఈ సందర్భంగా రూ.20వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షులు రవీందర్, నాయకులు రాజు, సవీన్, నాగరాజు, సందీప్, లక్ష్మణ్, షాజి పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**నవతెలంగాణ-కోటగిరి**

మండలంలోని ఏత్తోండ గ్రామంలోని గౌతమ్‌నగర్ కాలనీ నుంచి శివాలయం వరకు రూ. 17 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ ఫారుక్ శనివారం ప్రారంభించారు.

## నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

**నవతెలంగాణ-కోటగిరి**

నులిపురుగుల నివారణకు కృషి చేయాలని పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి గోవర్ధన్ అన్నారు. శనివారం ఉమ్మడి మండలంలోని ఆశావర్కర్లు, అంగన్వాడీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు మనీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## కేజ్‌వీల్ ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి

**నవతెలంగాణ-సదాశివనగర్**

కేజ్‌వీల్ ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని భూంపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. భూంపల్లి గ్రామానికి చెందిన ఎదులాయి రమేష్ (49) తన సొంత ట్రాక్టర్‌తో అతని వ్యవసాయ భూమిలో కేజ్‌వీల్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడగా తీవ్ర గాయాలైన రమేష్ అక్కడికక్కడే చనిపోయాడు. మృతుని భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

**నవతెలంగాణ-రెంజల్**

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదివే ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యమైనట్లు వారి తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దూపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు.. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఇద్దరు బాలికల తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంపు

**నవతెలంగాణ-భిక్కనూర్**

మండల కేంద్రంలో గల 132/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పెంచినటు విద్యుత్ శాఖ ఏడీఏ కిరణ్ చైతన్య తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ సబ్ స్టేషన్‌లో 16 ఎంవిఐ కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వినియోగదారులకు కరెంటు సరిపోవడం లేదని, ఈ విషయాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సంబంధిత ఉన్నత అధికారులతో మాట్లాడగా 31.5 ఎంవిఐ ట్రాన్స్‌ఫార్మర్ పంపించగా, సబ్ స్టేషన్‌లో బిగించి కూలింగ్ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సంకీర్త్, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## నేడు ఎల్లారెడ్డిలో ముత్యాల పోచమ్మ బోనాలు

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణంలో నేడు నిర్వహించబోయే బోనాల పండుగ ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్, ఆలయ కమిటీ అధ్యక్షులు కుడుముల సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఆలయ కమిటీ కార్యదర్శి వినోద్, సింగల్ విండో చైర్మన్ నరసింహులు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సతీష్ తదితరులున్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళాలు అందజేత

**నవతెలంగాణ-భిక్కనూర్**

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి శనివారం భక్తులు విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన వంగ నరేష్ కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధికి తమ వంతుగా రూ. 5116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తాటిపల్లి సిద్ధిరాములు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు సాయిరెడ్డి, సర్పంచ్ స్వామి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు నాగరాజు సభ్యులు ఉన్నారు.

## రాగి జావా, బెల్లం పౌడర్ అందజేత

**నవతెలంగాణ-రామారెడ్డి**

మండలంలోని ఆయన ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న రాగి జావా కోసం రాగిజావ పౌడర్, బెల్లం పౌడర్‌ను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజులు, అరుంధతి, సీఆర్పీలు మహమ్మద్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ-రామారెడ్డి**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధన కోసం టిఎస్‌సిపిఎస్‌ఈయు తలపెట్టిన పాత పెన్షన్ సంకల్ప యాత్ర పోస్టర్‌ను మండల కేంద్రంలో యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షులు కుంభాజీ ఆనంద్ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25న జరిగే పాత పెన్షన్ సంకల్ప యాత్రను విజయవంతం చేయడానికి మండలంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామారెడ్డి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజులు, జిల్లా అధ్యక్షులు ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కోశాధికారి లింగం, ఉపాధ్యాయులు లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించాలి

- కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- కొనసాగుతున్న సమ్మె

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**వర్ని(చందూర్)** : మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించాలని ఉమ్మడి మండలానికి సంబంధించిన మధ్యాహ్న భోజన కార్మికులు చందూర్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమ్మె నోటీస్‌ను శనివారం అందజేశారు. పెరిగిన జీతాలు రాలేదని, మూడు నెలల నుంచి ఎండీఎం బిల్లులు రాలేదని అందుకు సమ్మెకు సిద్ధమైనట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన కార్మికులు ఉన్నారు.



కోటగిరి : నిరసన తెలుపుతున్న కార్మికులు

**మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన..**

**కోటగిరి** : మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మోకాళ్ళ మీద నిలబడి ముఖ్యమంత్రికి దండం పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు భూమయ్య, పుష్ప, కావ్య, రమణమ్మ సరిత, ఉష తదితరులు పాల్గొన్నారు.

**మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

**ఎల్లారెడ్డి** : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ బత్తిని దేవేందర్, మండల అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలి

**నవతెలంగాణ-లింగంపేట్/పెద్దకొడప్‌గల్**

పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని మండల విద్యాధికారి రామస్వామి విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. శనివారం లింగంపేట్ ప్రాథమిక బాలికల పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సూరయ్య, కాంప్లెక్స్ సిఆర్పి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**పెద్దకొడప్‌గల్** : మండలంలోని కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సంజీవరెడ్డి అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విట్టల్, స్కూల్ చైర్మన్ సోంపేట సాయిలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**దోమకొండ** : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా జడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్ : సమావేశంలో పాల్గొన్న పలువురు

# పంటలు పరిశీలన.. రైతులకు సూచన

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**పెద్దకొడప్‌గల్** : మండలంలోని కాటేపల్లి గ్రామంలో రైతులతో కలిసి పత్తి పంటను మండల వ్యవసాయ అధికారి నదిముద్దీన్ శనివారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా కొత్తగా పట్టాలు కలిగిన వారు రైతు బీమా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. సర్పంచ్ బోధనం విట్టల్, ఏఈఓ రూప, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ : పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

**లింగంపేట్** : మండలంలోని మోతే గ్రామంలో మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ మొక్కజొన్న, సోయాబీన్ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో అనిల్ కుమార్, ఏఈఓ సంతోష్, రైతులు సుధాకర్‌రెడ్డి, సత్తయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**గాంధారి** : మండలంలోని గుర్జాల్ గ్రామ పరిధిలోని మొక్కజొన్న, సోయా బీన్, పత్తి, కంది పంటలను మండల వ్యవసాయ అధికారి నరేష్ పరిశీలించారు. వివిధ కలుపు మందులపై, తెగుళ్ల నివారణ చర్యల గురించి వివరించారు. ఏఈఓ విఘ్నేష్, రైతులు పాల్గొన్నారు.

**మద్నూర్** : రైతులు పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రాజు అన్నారు. మండలంలోని పెద్దతడ్గూర్ గ్రామంలో పలు పంటలను ఆయన పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్, రైతుబంధు సభ్యుడు గంగారాం, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

**పచ్చి రొట్టతో సారవంతం..**

**రామారెడ్డి** : పచ్చిరొట్ట ఎరువులతో భూ సారవంతం పెరుగుతుందని ఏఈఓ రాకేష్ రైతులకు సూచించారు. మండలంలోని రామారెడ్డి పరిసరాల్లో రైతులు సాగు చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు.

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

**నవతెలంగాణ-లింగంపేట్**

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర ఐటీ సెల్ చైర్మన్ మదన్ మోహన్ రావు ప్రజలకు ధీమా ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీ మత్తడి కిందిపల్లి, సరస్వతి నగర్, కొత్త బస్టాండ్, జెండాగల్లీ, మోతీబేస్ మాసుల్దర్ గల్లితో పాటు పలు కాలనీల్లో పల్లెపల్లెకూ కాంగ్రెస్, గడపగడపకూ మదన్ అన్న కార్యక్రమంలో భాగంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రుణమాఫీ, నాలుగు వేల రూపాయల పింఛన్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 24 గంటలు ఉచిత కరెంట్ అందిస్తామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ నారాగౌడ్, రఫియొద్దీన్, జోనాల రాజు తదితరులు పాల్గొన్నారు.



పల్లెపల్లెకూ కాంగ్రెస్‌లో మదన్‌మోహన్‌రావు

## డీసీపీని మర్యాద పూర్వకంగా కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మధుసూదన్ ముదిరాజ్‌ను నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, బాన్సువాడ నియోజకవర్గ టిడిపి పార్టీ ఇన్చార్జ్ కరాటే రమేష్ కుమార్ ముదిరాజ్, కాసాని, యువత అధ్యక్షులు కిరణ్ కుమార్ ముదిరాజ్, మత్స్యశాఖ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ ముదిరాజ్ ఉన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య డ్రైవ్

నవతెలంగాణ-బోధన్‌టౌన్
బోధన్ పట్టణంలోని అన్ని వార్డులలో నీటి నిలువ ప్రదేశాలను గుర్తించి లోతట్టు ప్రాంతాలలో పారిశుధ్య డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. కొబ్బరి చిప్పలో, కూలర్లలో, కంటైనర్లలో, టైర్లలో అలాగే కుండీలలో నీటిని పారవేయడం ద్వారా సీజనల్ వ్యాధులైన డెంగ్యు, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని మున్సిపల్ చైర్మెన్ తూము పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమాద్, జిల్లా మలేరియా అధికారి తుకారం రాథోడ్, బోధన్ ఏరియా డాక్టర్ విద్య, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, హెల్త్ సూపర్ వైజర్లు కిరణ్ రాజ్, నిర్మల, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, జావీద్ పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

- 19 ఏండ్లలోపు వారందరూ వేసుకోవాలి
- నులిపురుగు నివారణపై శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ వేల్పూర్
జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంపై ఇందల్‌వాయిలో ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు, సూపర్వైజర్లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ శిక్షణలో వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ... జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమం 20 జులైన జరుగుతుందని, ఆ రోజుల్లో ప్రతి ఒక్కరూ అల్బెండజోల్ మాత్రమే తీసుకోవాలని తెలిపారు. 2-19 సంవత్సరాల వయసు గల పిల్లలందరూ తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలని అన్నారు. ఒకటినుండి రెండేళ్ల వయస్సు గల పిల్లలందరికీ 200 ఎంజి అనగా అర్ధమాత్రను నులిపి వేయాలని తెలిపారు. ఆపైన వారందరికీ ఒక మాత్ర అనగా ఇవ్వాలని సూచించారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలోనూ ప్రతి పాఠశాలలోనూ ప్రతి కళాశాలలోనూ 19 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలందరికీ కచ్చితంగా ఈ మాత్రను ఇవ్వాలన్నారు. కడుపునిండా


డిచ్‌పల్లి:డిజిటల్ బి.పి. ఆపరేటర్లను అందజేస్తున్న డాక్టర్ సంతోష్ కుమార్

భుజించిన తర్వాత మాత్రమే ఈ మాత్రను వేయాలని పేర్కొన్నారు. ఏమైనా సైడ్ ఎఫెక్ట్ వచ్చినట్లయితే స్థానిక వైద్యాధికారికి గాని స్థానిక ఆరోగ్య కార్యకర్తకు గాని సమాచారం ఇవ్వాలన్నారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ.. మిషన్ ఇంద్రధనస్సు అనే కార్యక్రమం ఆగస్టు 7 నుండి 12 మధ్యలో జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించి ఆశా కార్యకర్తలు రెండేళ్ల వయస్సు గల పిల్లల లిస్టును ఇంటింటికి తిరిగి సర్వే చేసి తయారు చేయాలని సూచించారు. ఎవరైనా పిల్లలకు టీకాలు ఇవ్వని ఎడల వారి పేర్లు రాసుకోవాలని దానికిగల కారణాలు రాసుకోవాలని చెప్పారు. ఇటుక బట్టీలలో, ఇంటి పనులలో, లేదా ఇంటి నిర్మాణ పనులలో, బ్రిడ్జి నిర్మాణ పనులలో, ఏదైనా ప్రాజెక్టు పనులలో ఉంటున్న హైరిస్క్ ఏరియాను గుర్తించి ఆ ఏరియాలలో పనిచేస్తున్న పిల్లలలో టీకా కార్యక్రమం జరిగిందా లేదా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని డ్రాప్ అవుట్ పిల్లలు, తప్పిపోయిన పిల్లలు ఎవరైనా ఉన్నట్లయితే వారికి లబ్ధి చేకూర్చేలా ఈ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు . ప్రతి ఆరోగ్య కార్యకర్తకు డిజిటల్ బి.పి. ఆపరేటర్లను వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ అందజేశారు. ఈ డిజిటల్ బిపి ఆపరేటర్ తో ప్రతి ఒక్క ఆరోగ్య కార్యకర్త ఇంటింటికి వెళ్లి హైపర్ టెన్షన్ తో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించాలని వైద్యాధికారి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్‌వాయి పరిధిలో 22 మంది ఆరోగ్య కార్యకర్తలకు బిపి ఆపరేటర్లు అందజేయడం జరిగిందని వివరించారు. అసంక్రమిత వ్యాధులైన హైపర్ టెన్షన్ వ్యాధిని గుర్తించడానికి ప్రతి ఒక్కరికి డిజిటల్ బిపి ఆపరేటర్ ఇంటింటికి వెళ్లి 30 ఏళ్ళ పైబడిన ప్రతి వ్యక్తి బీ.పీని నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఉమారాణి, ఫార్మసిస్ట్ విజయలక్ష్మి, సునీత ,స్వరూప, ఆనంద్ ,అనిత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ఎంఎల్‌ఎచ్‌పిలు పాల్గొన్నారు.

**వేల్పూర్ :** మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం. అశోక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె వీణ ఆధ్వర్యంలో నేషనల్ డివామింగ్ డే ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు, అంగన్వాడీ టీచర్స్ కి అవగాహన కల్పించారు. ఒకటి నుండి రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం ట్యాబ్లెట్ రెండు నుంచి మూడు సంవత్సరాల పిల్లలకి ఒక టాబ్లెట్ క్రష్ చేసి వేయాలనీ సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ప్రవేట్ పాఠశాల ఉపాధ్యాయులు మరియు అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# 19న మెగా హెల్త్ క్యాంపును విజయవంతం చేయాలి

నవతెలంగాణ-రెంజల్/బోధన్ టౌన్
బోధన్ నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్యాన్ని దష్టిలో పెట్టుకొని ఆయేషా వెల్ఫర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించే మెగా హెల్త్ క్యాంప్‌ను వినియోగించుకోవాలని బోధని ఎమ్మెల్యే మొహమ్మద్ షకీల్ ఆమీర్ సతీమణి అయేషా వెల్ఫేర్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఫాతిమా స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, డ్వాక్రా గ్రూపు మహిళలతో ఆమె ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిళా సర్పంచు ముళ్ళపూడి శ్రీదేవి, ఎంపీటీసీలు గంగాలత, గడ్డం స్వప్న, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, అంగన్వాడి టీచర్లు సుజాత, రజిని, విజయలక్ష్మి రాజ్యలక్ష్మి, సురేఖ, పద్మ మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**బోధన్ టౌన్ :** బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ సతీమణి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ఫ్రీ మెగా హెల్త్ క్యాంప్ డ్రైవ్ నిర్వహిస్తున్న సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ అలాగే కౌన్సిలర్లతో కలిసి హెల్త్ క్యాంప్ ప్రచార గోడప్రతులను శనివారం ఆవిష్కరించారు. 30 రకాల వ్యాధులకు సంబంధించిన డాక్టర్లు శిబిరానికి వస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వారికి కూడా చికిత్స పొందేందుకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, కౌన్సిలర్లు అబ్దుల్లా, పౌల్, అశ్వాక్, బీఆర్ఎస్ యువనాయకులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కల్పించాలి

- బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్: బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఆటో డ్రైవర్లకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లించాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బిఎల్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

రాష్ట్రంలో లక్షలాదిమంది ఆటో డ్రైవర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోయినా ప్రైవేటు ఫైనాన్స్‌ల ద్వారా అప్పులు చేసి రాత్రి పగలు పనిచేసిన కుటుంబాన్ని పోషించలేని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 8వేల రూపాయల ఇన్సూరెన్స్ చెల్లించాలని, ఆటోలకు వేలకు వేలు జరిమానాలు వేయడంతో ఆటోడ్రైవర్లు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె.మధు, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ కన్వీనర్ రమేష్, కో- కన్వీనర్ హైమద్ హుస్సేన్. నాయకులు గోపి, గిరి, సాయిబాబా, వెంకట్, కె.రాజు, ఎం.రాజు, రాజు పాల్గొన్నారు.

# నలంద పాఠశాలలో నో బ్యాగ్‌డే

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని మామిడిపల్లి నలంద హై స్కూల్లో నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థికి ఎప్పుడూ చదువులే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు ,సహపాఠ్యాంశాలలో కూడా ప్రతి విద్యార్థి పాల్గొనేలా చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశంతో అందువల్ల ఈ నో బ్యాగ్ డే ను నిర్వహించి. చిత్రలేఖనం. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


నలంద పాఠశాలలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

కార్యక్రమంలో నలంద పాఠశాల యాజమాన్యం, ప్రసాద్, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించడానికి వారి ప్రతిభను కనబర్చడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ బీమా సామాన్యుడికి ధీమా

నవతెలంగాణ-కంఠేశ్వర్
పోస్టల్ భీమాతో సామాన్యుడికి ధీమా పెరిగి ఆర్థిక చేదోడుగా నిలుస్తుందని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ స్ఫూర్తితో రైతునేత, తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపక సభ్యులు, తెలంగాణ ఉద్యమకారులు వేముల సురేందర్ రెడ్డి జ్ఞాపకార్థం ముప్పై మంది సామాన్యులకు స్వంత ఖర్చుతో పోస్టల్ బీమా కల్పించినట్లు తెలిపారు. జిల్లాకోర్టు చౌరస్తాలో ఈ సందర్భంగా నిర్వహించిన బీమా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరువందల రూపాయల బీమా ప్రీమియం చెల్లింపు తో పది లక్షల ప్రమాద పరిహారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదాలలో గాయాలపాలైతే, గాయాల తీవ్రతను బట్టి వేల రూపాయల బీమా సౌకర్యం ఉందని వివరించారు. సామాజిక సేవే లక్ష్యంగా మరికొందరికి పోస్టల్ బీమా కల్పించడానికి ఉడత భక్తిగా తనవంతు ప్రయత్నాలు చేస్తానని యెండల తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు ఆశ నారాయణ, తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాల విద్యార్థులు నరేంద్ర నాథ్, అఖిల్, నిఖిల్, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రాజకీయ ప్లీనరీకి తరలిన నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లోగల కేబీఆర్ కన్వెన్షన్‌లోగల బీసీ రాజకీయ ప్లీనరీలో పాల్గొనడానికి జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీసీ సంఘం నాయకులు కార్యకర్తలు శనివారం దాదాపు 20 వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. నరాల సుధాకర్ మాట్లాడుతూ తామెంతో మాకంత వాటా అనే నినాదంతో జరుగుతున్న ఈ బీసీ రాజకీయ ప్లీనరి ద్వారా బీసీలు తమ సత్తా చాటబోతున్నారన్నారు. ఓట్ హమారా సీట్ హమారా అనే డిమాండ్‌తో ముందుకు సాగుతాం అని అన్నారు. హైదరాబాద్ కు బయల్దేరిన వారిలో దర్శనం దేవేందర్, సత్యప్రకాష్, మాడవేడి వినోద్, కరిపె రవిందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, సురేందర్, కోడూరి స్వామి, లక్ష్మీనారాయణ రాజు, చంద్రమోహన్, గోపాలకృష్ణ, సదానంద్, బాలన్న, పోశెట్టి, దేశాయి గంగాధర్, శేఖర్, రమణ స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మద్నూర్‌కు డిగ్రీ కాలేజ్ మంజూరయ్యేనా?

నవతెలంగాణ-మద్నూర్
మద్నూర్ మండల విద్యార్థుల ఏండ్ల నాటి కళ.. డిగ్రీ కళాశాల మంజూరు.. ఇప్పట్లో నెరవేరేనా ? అన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనిపై ఇటీవలే జూన్ 20వ తేదీన మద్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మద్నూర్ మండలంతో పాటు నియోజకవర్గంలోని జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండల కేంద్రాలకు సెంటర్ లైటింగ్ కోసం మంజూరైన నిధులపై మాట్లాడి.. అదే రోజు మద్నూర్ మండల కేంద్రానికి 15 నుంచి 30 రోజుల్లో డిగ్రీ కళాశాల మంజూరు ఉత్తర్వులు వస్తాయని ఎమ్మెల్యే హనుమంతు షిండే హామీనిచ్చారు. ఎమ్మెల్యే హామీ గడువు 15 రోజులు దాటింది. మరో ఐదు రోజులు అయితే నెల రోజులు కూడా పూర్తి కావస్తుంది. కానీ కళాశాల హామీ నెరవేరేనా అనే చర్చ మండల ప్రజల్లో నడుస్తోంది. డిగ్రీ కళాశాల మంజూరు కోసం మండల విద్యార్థులు తల్లిదండ్రులు ఏండ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ గడువు నెల రోజులు దగ్గర పడటంతో డిగ్రీ కళాశాల మంజూరు అయ్యేనా అనే ఆందోళనలో విద్యార్థులు ఉన్నారు.

## శ్రీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-వర్ని
మండలంలోని శ్రీనగర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు గిరి, ఎంపీపీ మేక శ్రీలక్ష్మి విరాజ్, సర్పంచ్ రాజు, జడ్పీటీసీ హరిదాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, నామాల సాయిబాబా, మైనార్టీ అధ్యక్షులు హైమద్, కోఆప్షన్ మెంబర్ ఖరీం, వైస్ ఎంపీపీ దండ్ల బాలరాజు, కులకర్ణి సంతోష్, ప్రజాప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న భాస్కర్ రెడ్డి

## ఏకరూప దుస్తులు పంపిణీ


ఏకరూప దుస్తులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కపిల్ పటేల్

నవతెలంగాణ-జుక్కల్
మండలంలోని నాగల్‌గావ్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ కపిల్ పటేల్ చేతుల మీదుగా విద్యార్థులకు ఏకరూప దుస్తులను శనివారం పంపిణీ చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు సునీల్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలు, ఆశాలు సహకరించాలి

నవతెలంగాణ-బోధన్‌టౌన్
బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు తరలివచ్చే విధంగా అంగన్వాడీలు, ఆశావర్కర్లు సహకరించాలని బోధన్ ఎమ్మెల్యే సతీమణి ఆయోషా ఫాతిమా కోరారు. శనివారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు.

## లయన్స్ బోధన్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-బోధన్ టౌన్
లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవలు మరువలేనివని డిస్ట్రిక్ట్ సెక్రటరీ లయన్ సురాబత్తిని శ్రీనివాసరావు అన్నారు. శనివారం క్లబ్ ఆధ్వర్యంలో బోధన్ మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థినీలకు మ్యాగీ మసాలా ప్యాకెట్, బాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ నవిత, సెక్రటరీ వెంకటలక్ష్మీ, ప్రతినిధులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డిలోని మైనారిటీ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 8 సీట్లు, 7వ తరగతిలో 4 సీట్లు, 8వ తరగతిలో 1 సీటు, 8వ తరగతిలో బీసీ 1, 8వ తరగతిలో ఓసీ 1 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ సీట్లను బుధవారం లాటరీ పద్ధతిన భర్తీ చేస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ప్రాథమిక పాఠశాలకు వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని గోవింద్‌పేట్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు ప్రముఖ విత్తన వ్యాపారి అప్పాల ఆనంద్ రెడ్డి) 5వేల విలువ గల సౌండ్ బాక్స్ శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాడవేడి పద్మావతి ,ఉపాధ్యాయ బృందం వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 17న నిరసన దీక్షలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఈనెల 17 న నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్ ఓ. రమేష్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై, నూతనంగా ఏర్పడిన గురుకుల పాఠశాలలకు భౌతిక వసతులను కల్పించాలని, అన్ని సొసైటీలో ఏకరూప పరిపాలన అమలు చేయాలని, ఒకే రకమైన టైం టేబుల్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:30 వరకు ఉండే విధంగా మార్చాలని పేర్కొన్నారు. గురుకుల ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని, కేర్ టేకర్, డిప్యూటీ వార్డెన్లను ప్రత్యేకంగా నియమించి ఉపాధ్యాయులను నైట్ డ్యూటీల నుండి మినహాయించాలని తెలిపారు. ఆదివారం, పండుగ దినాల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వీక్ ఆఫ్ వర్తింపచేయాలని, కాంట్రాక్టు, గెస్ట్, పార్ట్ టైం, ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం ఇవ్వాలని, సిఆర్టిల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షను జిల్లాలోని అన్ని సొసైటీ గురుకుల ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## 'ఆ రోజు లీవ్‌లో ఉన్నా'

నవతెలంగాణ-ముప్కాల్
మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం రోజు రాత్రి విద్యుత్ లోపం కారణంగా దాదాపు గ్రామంలో సగభాగం వరకు ఇండ్లల్లో ఉండే టెలివిజన్లు, ఫ్రిజ్ లు, కూలర్లు, విద్యుత్ దీపాలు లో వోల్టేజ్ కారణంగా కాలిపోయినట్లు గ్రామస్థులు ఆరోపించగా, అందుకు స్థానిక లైన్ మెన్ కిషోర్ శనివారం రోజు వివరణ ఇచ్చారు. లో వోల్టేజ్ కారణంగానా, మరే ఇతర కారణాలతో జరిగిందో తనకు తెలియదని, ఆ రోజు తాను విధుల్లో లేనని ఒకరోజు ముందుగానే సెలవుపై ఉన్నట్లు తెలిపారు. డ్యూటీలో ఉంటే ఇలాంటి పరిస్థితి ఏర్పడేది కాదన్నారు. గ్రామంలో ఎప్పుడు విద్యుత్ విషయంలో అందుబాటులో ఉంటున్నాని, తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రతి రోజు గ్రామస్తులకు విద్యుత్ విషయంలో అందుబాటులో ఉంటున్నట్లు వివరించారు..

## ట్రాఫిక్, ఆర్టీసీ, రవాణా శాఖ అధికారుల తనిఖీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బైపాస్ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసీ రవాణాశాఖ అధికారులు ముకుమ్మడిగా శనివారం తనిఖీలను నిర్వహించారు. ట్రాఫిక్, రవాణా, ఆర్టీసీ అధికారుల ఆదేశాల మేరకు డిఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు చేపట్టారు. మితిమీరి ఆటోలో ఎవరైనా ఎక్కించుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు, మూడు కేసులను నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఇదే పద్ధతిని కొనసాగిస్తామని ఆటో డ్రైవర్లకు హెచ్చరించారు. రవాణా శాఖ అధికారులు కూడా వాహనాలను తనిఖీలు చేసి వాహన ధ్రువ పత్రాలు పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసులు ఆటోలలో మితిమీరి ప్రయాణించిన వారిని పట్టుకుని సైడ్‌కున్న సీట్లను తొలగించారు. ఇప్పటినుండి నగరంలో ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తనిఖీలు నిర్వహిస్తారని అన్ని శాఖల అధికారులు తెలిపారు. వందలోపు వాహనాలను తనిఖీలు చేశారు.

## దోస్పల్లిలో హరితహారం

నవతెలంగాణ-జుక్కల్
మండలంలోని దోస్పల్లి గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల ఆవరణలో సర్పంచ్ సునీతా పటేల్ హరితహారంలో భాగంగా మొక్కలు నాటినట్టు హెచ్‌ఎం శంకర్ తెలిపారు. కార్యక్రమంలో జేపీఎస్ జాదవ్ మనోహర్, ఎఫ్ఏ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## మినీవాటర్ ట్యాంక్, పైప్‌లైన్‌కు భూమిపూజ


రజక సంఘానికి భూమిపూజ చేస్తున్న గ్రామ సభ్యులు

నవతెలంగాణ-వేల్పూర్
వేల్పూరు గ్రామం లో రజక సంఘం మడేలయ్య మందిరం వద్ద మంత్రి వర్యులు ప్రశాంత్ రెడ్డి సహకారంతో ఎంపీటీసీ మొండి మహేష్ నిధుల నుండి మినీవాటర్ ట్యాంక్, పైప్‌లైన్ కోసం భూమి పూజ శంకు స్థాపన చేశారు. రజకుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు సంక్షేమ పథకాలు చేపట్టడం జరిగిందని మండల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిపి మెంబర్ రేగుల్ల రాములు ఎంపిటి సి మొండి మహేష్ , సర్పంచ్ తీగల రాధ మోహన్ , ఉప సర్పంచ్ పిట్ల సత్యం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బబ్బుర్ ప్రతాప్, బీమా రాజేందర్, విడిసి అధ్యక్షులు కమలేశ్, చాకలి బాలయ్య , ప్రశాంత్, కార్తీక్, దేవేందర్, ప్రవీన్, నర్సయ్య, చంది, సిహెచ్.ప్రవీణ్, నితిన్, శ్రీనివాస్, అశోక్, పకిర్, గణేష్, ముత్యాల నర్సయ్య, చంద్ర మోహన్ పాల్గొన్నారు.

## టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి


కరుణాకర్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి
ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డిని నియమించినట్టు మాజీ ఎంపీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, కో చైర్మన్ మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ సయ్యద్ అజ్మతుల్లా హుసేన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి బోధన్ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో తన వంతు కృషి చేస్తున్నట్లు మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు.

## విఠలేశ్వరుని ఆలయంలో సంత్ శిరోమణి మహారాజ్ పుణ్యతిథి

నవతెలంగాణ-మద్నూర్
మండల కేంద్రంలో గల విఠలేశ్వర ఆలయంలో మద్నూర్ మండల మేరు (దర్జీ) కులస్తుల ఆధ్వర్యంలో శనివారం శ్రీ సంత్ శిరోమణి నాందేవ్ మహారాజ్ 673వ సజీవ సమాధి (పుణ్యతిథి) కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. వార్కారి భజన మండలి ఆధ్వర్యంలో నాందేవ్ మహారాజ్ జీవిత చరిత్ర తెలిపారు. అలాగే తీర్థ ప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మద్నూర్ మండల మేరు కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తకు పరామర్శ


సంపత్ రాజును పరామర్శిస్తున్న సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్
మండల కేంద్రానికి చెందిన సంపత్ రాజు కాంగ్రెస్ కార్యకర్త ఆరోగ్యం బాగాలేక గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండటంతో ఈ విషయం తెలిసిన వెంటనే ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి.. కుటుంబ సభ్యులను పరామర్శించారరు. రాజు ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. అనంతరం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట రామారెడ్డి మండల జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య ఉన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ నాలుగు ఈవెంట్లు పూర్తి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
స్పోర్ట్స్ స్కూల్ లో 4వ, 5వ తరగతి అడ్మిషన్ల నాలుగు ఈవెంట్లు పూర్తి అయ్యాయి అని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న అన్నారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హాకింపేట్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్, హకీంపెట్, రీజినల్ స్పోర్ట్స్ స్కూల్ కరీంనగర్, ఆదిలాబాద్ లో 4వ, 5వ తరగతిలో అడ్మిషన్ కొరకు ఈనెల 11న నాగారం లోని రాజారాం స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఎంపికలో మొత్తం 45 మంది బాలురు, 17 మంది బాలికలు పాల్గొన్నారు. ఆ రోజు మొత్తం 10 ఈవెంట్లలో ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, కేజీ, మెడిసిన్ బాల్ పుట్ పూర్తి చేశారు. మిగిలిన 4 ఈవెంట్లకు వాతావరణం అనుకూలించక రద్దు చేశారు. శనివారం మిగిలిన ఈవెంట్లు 30 మీటర్స్ ఫ్లైయింగ్ స్టార్ట్, 6ఐ10 షటిల్ రన్, 800-మీటర్స్ రన్, మెడికల్ టెస్ట్‌లు నిర్వహించామని తెలిపారు.